## అప్పులకు మిత్తి కట్టలేకపోతున్నాం

- బిల్లులు రావడం లేదని సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పులు తెచ్చి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టామని, వాటి బిల్లులు రాకపోవడంతో తీసుకొచ్చిన అప్పులకు మిత్తిలు కట్టలేకపోతున్నామని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట సోమవారం నందిపేట్ సర్పంచ్ సాంబారు వాణి ఆమె భర్తతో కలిసి పెట్రోల్‌పోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై అడ్డుకొని వారిని అధికారుల వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో చేసిన అభివృద్ధి పనులు, పారిశుధ్య పనులకు ఎంబి రికార్డులు చేసిన బిల్లులను ఉపసర్పంచ్ మాద రవి సంతకాలు చేయకుండా ఆపివేశారని ఆరోపించారు. బిల్లులపై సంతకాలు పెట్టకుండా వేధింపులకు గురి చేస్తున్నారని, సుమారు కోటిన్నర రూపాయలు నందిపేట్ మండల అభివృద్ధికి వెచ్చించామని, బిల్లులు మంజూరు చేయడంలో సహకరించడం లేదని వారు తెలిపారు. కోటిన్నరకు మిత్తితో కలిపి రూ.మూడు కోట్లకు పైగా అప్పు అయిందని, అప్పుల బాధ భరించలేక కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్య చేసుకుందామని వచ్చినట్టు తెలిపారు.

# పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి సహకారం

- తక్కువ సమయంలో దేశంలోనే పెద్ద ప్రాజెక్ట్ కాళేశ్వరం పూర్తి
- పరిశ్రమల ఏర్పాటుతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తామని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత అతి స్వల్ప వ్యవధిలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేసి అద్భుత విజయాలు సాధించామన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో రూ.450 కోట్లతో 59 ఎకరాల విస్తీర్ణంలో 16.5 లక్షల చదరపు అడుగుల బిల్ట్ ఏరియాలో నిర్మించిన ఐటిసి అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ అండ్ లాజిస్టిక్స్ ఫెసిలిటీని మంత్రి కెటిఆర్ ఐటిసి లిమిటెడ్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్‌పురి సమక్షంలో సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. సిఎం కెసిఆర్ నియోజకవర్గంలో ఇంత పెద్ద పరిశ్రమ రావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరో రూ.350 కోట్లతో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచనుందన్నారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు కంపెనీ తయారు చేసే చిప్స్, బిస్కెట్స్ కోసం ఆలుగడ్డలు, గోధుమలు ఇక్కడే కొనాలని,



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి కెటిఆర్

దాంతో ఇక్కడి రైతులకు ఆర్థిక అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. సమాజంలో మెరుగైన విద్యా, వైద్య తదితర రంగాల్లో సహకారమందించడానికి ఐటిసి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. సిఎస్ఆర్ నిధులను కేటాయించాలని సూచించారు. కంపెనీ కోసం భూములు కోల్పోయిన వారిని ఆదుకునే బాధ్యత మనపై ఉందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుని తక్కువ సమయంలో పూర్తి చేసి నీటి వనరుల్లో విప్లవం సాధించామన్నారు. పరిశ్రమలకు కాళేశ్వరం ద్వారా పది టిఎంసిల నీటిని అందిస్తున్నామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ హబ్ కోసం స్పెషల్ సెజ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. 68 లక్షల నుంచి మూడున్నర కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించే స్థాయికి ఎదిగామన్నారు. రైతుల ఆదాయం పెరగాలంటే వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలు అభివృద్ధి చెందాలని, ఆ దిశగా దృష్టి పెట్టామని తెలిపారు. వంట నూనెల పంటలను ప్రోత్సహిస్తూ వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయడం ద్వారా ఇతర దేశాల నుంచి వంట నూనెల దిగుమతిని తగ్గించడంపై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రాకల హేమలత శేఖర్ గౌడ్, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, ఐటిసి పరిశ్రమ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

## నెలలు నిండకముందే పుట్టిన శిశువు

- చికిత్సకు రూ.ఏడు లక్షలు వసూలు చేసిన ఆస్పత్రి యాజమాన్యం
- ఇంకా కట్టాలనడంతో బాధితుల ఆందోళన
- బిడ్డను నీలోఫర్ ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో




ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

నెలలు నిండకముందే.. అదీ ఆరు నెలల్లోనే పుట్టడం.. పసికందు తక్కువ బరువు ఉండటంతో ఐసియులో పెట్టి చికిత్స చేసిన ప్రయివేటు ఆస్పత్రి యాజమాన్యం బాధిత కుటుంబం నుంచి రూ.ఏడు లక్షలు కట్టించుకుంది. ఇంకా వైద్యం అందాలి.. డబ్బులు కట్టాలంటూ తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఆందోళనకు దిగారు. చివరకు పాపను నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన హైదరాబాద్ ఎస్సార్ నగర్ పోలీస్టేషన్ పరిధిలోని సౌమ్య చిన్న పిల్లల ఆస్పత్రిలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..

మెహిదీపట్నానికి చెందిన ఆరు నెలల గర్భిణి డిసెంబర్ తమ్మిదిన సౌమ్య ఆస్పత్రిలో చేరింది. పరిస్థితి బాగోలేనందున అదే రోజు ఆమెకు డెలివరీ చేశారు. పాప ఆరు నెలలకే పుట్టినందున 600 గ్రాముల బరువు మాత్రమే ఉందని, ఐసియులో ఉంచి వైద్యం చేయాలని వైద్యులు చెప్పడంతో బాధితులు అంగీకరించారు. డిసెంబర్ తొమ్మిది నుంచి జనవరి 30 (సోమవారం) వరకు వైద్యం చేస్తున్నామని, పాప రికవరీ అవుతుందని రూ.ఏడు లక్షలు వసూలు చేశారు. అయితే, చిన్నారికి అవయవాలు సరిగా ఎదగలేదని, ఇంకా వైద్యం చేసేందుకు మరో మూడు లక్షల రూపాయలు చెల్లించాలని ఆస్పత్రి యాజమాన్యం సోమవారం పాప తల్లిదండ్రులకు చెప్పింది. 52 రోజులు వైద్యం చేసినా.. రూ. ఏడు లక్షలు తీసుకున్నా ఇంకా.. పసికందు కండిషన్ మెరుగుకాకపోవడంపై కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి వద్ద ప్లకార్డులు పట్టుకుని పాపను డిశ్చార్జి చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. అదేవిధంగా.. మీడియాకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో పాపను తీసుకు వెళ్లొచ్చని ఆస్పత్రి యాజమాన్యం చెప్పింది. వెంటనే బాధితులు పసికందును అంబులెన్స్‌లో నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. తమకు జరిగిన అన్యాయం మరో తల్లిదండ్రులకు కలగకూడదని అన్నారు. సౌమ్య ఆస్పత్రిలో చాలా నిర్లక్ష్యంగా వైద్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం కెసిఆర్, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు జోక్యం చేసుకొని ఇలాంటి ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఆస్పత్రి యాజమాన్యాన్ని మీడియా వివరణ కోరగా.. 'మీరు ఏమి రాసుకుంటారో, రాసుకోండి.. ఇలాంటి పేషెంట్లు ఎంతోమంది వస్తుంటారు.. వెళ్తుంటారు' అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పింది.

# కేబుల్ ఆపరేటర్ల సమస్యపై సిఎం దృష్టికి తీసుకెళ్తాం..

- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- రాష్ట్ర మల్టీ సర్వీసెస్ కేబుల్ ఆపరేటర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కేబుల్ ఆపరేటర్‌ల సమస్యలను సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా న్యూటారిఫ్ ఆర్డర్ మూడును వ్యతిరేకిస్తూ సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద రాష్ట్ర మల్టీ సర్వీసెస్ కేబుల్ ఆపరేటర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ధర్నాకు హాజరైన మంత్రి మాట్లాడుతూ.. కేబుల్ రంగంలో పంపిణీదారుల దాష్టీకాన్ని నిలువరించడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేసిన చరిత్ర కేబుల్ ఆపరేటర్ వ్యవస్థ అన్నారు. కేబుల్ ఆపరేటర్ వ్యవస్థ దేశంలో ఒక గొప్ప మార్పు తీసుకొచ్చిందని తెలిపారు. కస్టమర్‌లపై కేబుల్ టివి వినోదపు భారం మునుపటి కంటే తగ్గే విధంగా కొత్త టారిఫ్ ఆర్డర్‌ను ప్రజల ముందుకు తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను మోడీ ప్రభుత్వం ప్రయివేటుపరం చేస్తోందన్నారు. ట్రాయ్ అసంబద్ధ విధానాలతో ధరలను పెంచుతున్నారన్నారు. కేబుల్ ఆపరేటర్లకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందిస్తామని చెప్పారు.




ధర్నాలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టీ ఫైబర్ ప్రాజెక్టులో కేబుల్ ఆపరేటర్లకు భాగ్యస్వామ్యం కల్పించి గ్రామాల్లో చివరి ఇంటి వరకు సేవలను అందించే విధంగా ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 25 వేల మందికి పైగా ఉన్న కేబుల్ ఆపరేటర్ కుటుంబాలను ఆదుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో మల్టీ సర్వీసెస్ కేబుల్ ఆపరేటర్ సంక్షేమ సంఘం కన్వీనర్ పామ్మి సురేష్, సుభాష్ రెడ్డి, కిషోర్, కోటి, ఉపేందర్, అంజిరెడ్డి, రమేష్, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భోగ శ్రావణి రాజీనామా అమోద పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్

## జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా ఆమోదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించిన భోగ శ్రావణి రాజీనామాకు సోమవారం కలెక్టర్ ఆమోదముద్ర వేశారు. అంతకు ముందు ఉదయమే రాజీనామా విషయంలో భోగ శ్రావణి నుంచి క్లారిటీ తీసుకున్న కలెక్టర్ రవి రాజీనామాను ఆమోదిస్తూ.. కొత్త చైర్మెన్ ఎన్నిక అయ్యే వరకు వైస్ చైర్మెన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్‌కు తాత్కాలిక చైర్మెన్ బాధ్యతలు ఇస్తున్నట్టు అధికారక ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రజాపంథా నాయకున్ని పరామర్శించిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాల్కొండ నియోజకవర్గం కమ్మర్పల్లి మండల కేంద్రానికి చెందిన సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా నిజామాబాద్ జిల్లా నాయకులు సురేష్‌ను సోమవారం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని వారికి సూచించారు. సురేష్‌కు మంత్రి మనోధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సహాయ కార్యదర్శి దేవారామ్, నిమ్స్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, రమేష్ తదితరులు ఉన్నారు.

# గ్రేగోల్డ్ పరిశ్రమలో ప్రమాదం

- ఇద్దరు దుర్మరణం .. ఒకరికి గాయాలు
- మూడు నెలల్లో రెండో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిమెంట్ పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగింది. ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని గ్రేగోల్డ్ సిమెంట్ పరిశ్రమలో జరిగింది. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం..

మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన మునగపాటి సైదులు(46), పట్టేటి సాయి(23), మల్లెబోయిన సైదులు పరిశ్రమలో రోజు మాదిరిగా కిలన్ దగ్గర పని చేస్తున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా కిలన్ బ్యాక్ ఫైర్ కావడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే హుజూర్‌గర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మునగపాటి సైదులు పరిస్థితి విషమించి మృతిచెందాడు. సాయిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు.



పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, కార్మికసంఘాల నేతలు, బాధిత కుటుంబ సభ్యులు

సైదులు కోదాడలో చికిత్స పొందుతున్నాడు. మూడు నెలల కిందట కూడా కిలన్ వద్ద ఇదే మాదిరి ప్రమాదం జరిగింది. అప్పుడు రెడపంగ రైతు మృతిచెందాడు. ఈ ఘటనతో గ్రామస్తులు, కార్మికసంఘాల నేతలు, కుటుంబ సభ్యులు పరిశ్రమ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరకు యాజమాన్యం కుటుంబసభ్యులను, గ్రామపెద్దలను, కార్మికసంఘాల నేతలను చర్చలకు పిలిచింది. బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికైనా పరిశ్రమలో మళ్లీ ఇలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు బిఆర్ఎస్‌కెవి నాయకులు వట్టెపు సైదులు, పచ్చిపాల ఉపేందర్, మాలోతు బాలునాయక్, రన్‌మియా తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సబ్జెక్టుపైనా అవగాహన ఉండాలి

- ఎస్ఆర్ శంకరన్ ఐఎఎస్ అకాడమీ ఫ్యాకల్టీ
- పోటీ పరీక్షలపై టిఎవిఎస్ ఆధ్వర్యంలో సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు, యువకులు ఆయా పరీక్షలకు సంబంధించి ప్రతి సబ్జెక్టుపైనా అవగాహన కలిగి ఉండాలని ఎస్ఆర్ శంకరన్ ఐఎఎస్ అకాడమీ ఫ్యాకల్టీ జనార్దన్ దండు, ప్రభాకర్ చౌటి అన్నారు. తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం (టిఎవిఎస్) ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని జెడ్పి సమావేశ మందిరం, ఉట్నూర్ పిఎంఆర్‌సిలో యుపిఎస్‌సి, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ తదితర పోటీ పరీక్షలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జనార్దన్



సదస్సులో మాట్లాడుతున్న అకాడమీ ఫ్యాకల్టీ సభ్యులు

దండు, ప్రభాకర్ చౌటి అవగాహన కల్పించారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విధానం.. స్టడీ మెటీరియల్, ప్రణాళిక తదితర వాటి గురించి క్లుప్తంగా వివరించారు. పోటీ పరీక్షల్లో ప్రతి సబ్జెక్టుపైనా అవగాహన పెంచుకొని రివిజన్ చేస్తూ చదవాలని సూచించారు. భయపడకుండా ఏకాగ్రతతో ప్రణాళికబద్ధంగా చదవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ శంకరన్ ఐఎఎస్ అకాడమీ పరిపాలన అధికారి కోట సతీష్, ఎస్‌సి స్టడీ సర్కిల్ డెరెక్టర్ రమేష్, టిఎవిఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, జిల్లా కార్యదర్శి బైరి సోమేశ్, ఉట్నూర్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేస్రం రాజు, జిల్లా అధ్యక్షులు తుమ్రం ఈశ్వర్, నాయకులు తనూష్, ఉయిక విష్ణు, కుంరం దీపక్, కొట్నాక్ సక్కు పాల్గొన్నారు.

## మతోన్మాదాన్ని వ్యతిరేకించినందుకే గాంధీ హత్య

- అజీజ్‌పాషా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతోన్మాదాన్ని వ్యతిరేకించినందుకే అత్యంత దుర్మార్గంగామహాత్మాగాంధీని మతోన్మాదులు హత్యచేశారని సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ అజీజ్‌పాషా చెప్పారు. హైదరాబాద్‌లోని మగ్ధూం భవన్‌లో గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, పశ్య పద్మ, ఇటి నర్సింహాలతో కలిసి అజీజ్‌పాషా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ జీవిత కాలం మతోన్మాదానికి వ్యతిరేకంగా నిలబడ్డారన్నారు. ఆయన మీద ఢిల్లీ బిర్లాహౌజ్‌లో హత్యాయత్నం జరిగిందని, హత్యకు పాల్పడిన వ్యక్తిని ఆరెస్టు చేయకుండా ఆపిన మహనీయుడు గాంధీ అని గుర్తుచేశారు. గాంధీ వర్ధంతి రోజున సిపిఐ జాతీయ సమితి లౌకికవాద పరిరక్షణ దినంగా పాటించాలని కోరారు. దేశంలో మతోన్మాద బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తుల ఆగడాలు పెరిగిపోయాయని, కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పబ్బం గడుపుతున్నారని తెలిపారు.

## 9న చలో హైదరాబాద్

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాల సాధనకు ఫిబ్రవరి 9న జరిగే చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ప్రజా సంఘాల పోరాట ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులందరికీ అందేలా ఈ బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి సూచించారు.

ప్రభుత్వ తీసుకొచ్చిన పథకం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి స్థలం ఉన్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలని లేదా నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల ఇండ్ల సమస్య పరిష్కరించలేని పక్షంలో ప్రజా సంఘాల ఐక్య పోరాట వేదిక ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. వెంటనే పేదలకు అందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 9న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి పేదలందరూ పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence

**Laurus Labs Limited**

**Regd.Office:** Plot No.21, Jawaharlal Nehru Pharma City, Parawada, Visakhapatnam - 531 021, Andhra Pradesh, India.
**Corp.Office:** 2nd Floor, Serene Chambers, Road No.7, Banjara Hills, Hyderabad - 500034, Telangana, India.
Tel: +91 40 3980 4333 ; Fax: +91 040 3980 4320 ; E-mail: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com

**(CIN: L24239AP2005PLC047518)**

Extract of Unaudited Consolidated Financial Results of Laurus Labs Limited for the quarter and nine months ended December 31, 2022 which are prepared in compliance with Indian Accounting Standards.

(₹ in Crores)

| SL. No. | Particulars | Quarter ended | | | Nine months ended | | Year ended |
|---|---|---|---|---|---|---|---|
| | | 31-Dec-22 | 30-Sep-22 | 31-Dec-21 | 31-Dec-22 | 31-Dec-21 | 31-Mar-22 |
| | | (Unaudited) | (Unaudited) | (Unaudited) | (Unaudited) | (Unaudited) | (Audited) |
| 1 | Total revenue from operations | 1,544.82 | 1,575.89 | 1,028.76 | 4,659.65 | 3,510.74 | 4,935.57 |
| 2 | Net Profit for the period (Before tax, Exceptional and/or Extraordinary items) | 277.85 | 328.07 | 203.50 | 961.80 | 782.14 | 1,083.85 |
| 3 | Net Profit for the period before tax (After Exceptional and/or Extraordinary items) | 277.85 | 328.07 | 203.50 | 961.80 | 782.14 | 1,083.85 |
| 4 | Net Profit for the period after tax (After Exceptional and/or Extraordinary items) | 202.54 | 233.39 | 154.95 | 688.16 | 600.51 | 832.23 |
| 5 | Total Comprehensive Income for the period | 202.43 | 228.78 | 154.02 | 682.44 | 597.72 | 833.26 |
| 6 | Net Profit for the period after tax (After Exceptional and/or Extraordinary items) attributable to: | | | | | | |
| | i) Equity holders of the Company | 203.04 | 232.81 | 153.73 | 687.13 | 597.02 | 827.52 |
| | ii) Non-controlling interests | (0.50) | 0.58 | 1.22 | 1.03 | 3.49 | 4.71 |
| 7 | Total Comprehensive Income for the period attributable to: | | | | | | |
| | i) Equity holders of the Company | 202.93 | 228.20 | 152.80 | 681.41 | 594.23 | 828.55 |
| | ii) Non-controlling interests | (0.50) | 0.58 | 1.22 | 1.03 | 3.49 | 4.71 |
| 8 | Equity Share Capital | 107.73 | 107.47 | 107.47 | 107.73 | 107.47 | 107.47 |
| 9 | Reserves (Excluding Revaluation Reserve) and Non-controlling interests as shown in the Audited Balance Sheet | | | | | | 3,243.72 |
| 10 | Earnings Per Share (of ₹ 2/- each) | | | | | | |
| | 1. Basic : ₹ * | 3.78 | 4.33 | 2.87 | 12.79 | 11.13 | 15.42 |
| | 2. Diluted : ₹ * | 3.76 | 4.32 | 2.85 | 12.74 | 11.07 | 15.35 |

* Not annualised for quarter and nine months ended.

**Notes :**

1. Additional information on Unaudited standalone financial results for the quarter and nine months ended December 31, 2022

(₹ in Crores)

| SL. No. | Particulars | Quarter ended | | | Nine months ended | | Year ended |
|---|---|---|---|---|---|---|---|
| | | 31-Dec-22 | 30-Sep-22 | 31-Dec-21 | 31-Dec-22 | 31-Dec-21 | 31-Mar-22 |
| | | (Unaudited) | (Unaudited) | (Unaudited) | (Unaudited) | (Unaudited) | (Audited) |
| 1 | Total revenue from operations | 1,500.70 | 1,498.16 | 932.58 | 4,494.11 | 3,329.38 | 4,707.04 |
| 2 | Profit before tax | 270.34 | 316.68 | 141.95 | 914.63 | 690.44 | 975.41 |
| 3 | Profit after tax | 199.05 | 227.44 | 109.16 | 658.10 | 528.87 | 750.09 |
| 4 | Total Comprehensive Income for the period | 198.91 | 227.28 | 108.83 | 657.65 | 527.88 | 750.89 |

2. The above is an extract of the detailed format of Quarterly/Nine months ended Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of the SEBI (Listing and Other Disclosure Requirements) Regulations, 2015. The full format of the Quarterly/Nine months ended Financial Results are available on the websites of the Stock Exchanges and the Company namely www.bseindia.com, www.nseindia.com and www.lauruslabs.com
3. The above financial results of the Company as reviewed by the Audit Committee has been approved by the Board of Directors at its meeting held on January 30, 2023.

By order of the Board
For **Laurus Labs Limited**

Place: Hyderabad
Date : January 30, 2023

**Dr. Satyanarayana Chava**
Whole Time Director & Chief Executive Officer

## ప్రగతి భవన్ ముందు దంపతుల ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం తమ భూమిని తీసుకుని నష్టపరిహారం చెల్లించడం లేదంటూ హైదరాబాద్‌లోని ప్రగతిభవన్ ముందు భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన ఐలేశ్ సోమవారం భార్యతో కలిసి ప్రగతిభవన్ వద్దకు చేరుకున్నాడు. అక్కడ ఒక్కసారిగా ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు అప్రమత్తమై వారిని అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ భూమిని ప్రభుత్వం తీసుకుని నష్టపరిహారం చెల్లించడం లేదని ఐలేశ్ ఆరోపించారు.

## టెక్నాలజీతో ఆర్‌టిసి నిర్వహణ నల్సాఫ్ట్‌తో ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి నిర్వహణకు టెక్నాలజీని అనుసంధానం చేస్తూ ఆర్‌టిసిలో కార్యకలాపాలను నిర్వహించనున్నట్టు టిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ తెలిపారు. సంస్థలో ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ (ఇఆర్‌పి) అమలు కోసం సోమవారం 'నల్సాఫ్ట్' సంస్థ సిఇఒ సిఎ వెంకట నల్లూరితో ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ ఇఆర్‌పి సాధ్యం కోసం తొమ్మిది నెలల్లో అన్ని విభాగాల్లోనూ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసేలా ఒప్పందం జరిగిందని తెలిపారు. అంతర్గత సామర్థ్యం పెంచుకోవడం కోసం ఇది ఉపయోగపడుతుందన్నారు. డిపోలు, జోన్లతో పాటు హెడ్ ఆఫీస్‌లోని ఫైనాన్స్, హెచ్‌ఆర్, ఇంజనీరింగ్ తదితర విభాగాలను ఇఆర్‌పి ఏకీకృతం చేస్తుందని వివరించారు. 2023 టిఎస్‌ఆర్‌టిసికి ఐటీ సంవత్సరం అని తెలిపారు. నాల్‌సాఫ్ట్ సిఇఒ సిఎ వెంకట నల్లూరి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో ఆపరేషన్లను కేంద్రీకృతం చేయడం, మార్గాలను క్రమబద్ధీకరించడం, ఇంధన నిర్వహణ, వ్యక్తిగత, స్టోర్‌లు, వర్క్‌షాప్‌లు, సమర్థవంత ఆదాయ నిర్వహణ తదితర విషయాలపై దృష్టి పెడతామన్నారు. దీనికి ఉద్యోగులంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టిఎస్‌ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వినోద్ కుమార్, చీఫ్ మేనేజర్ (ఎఫ్ అండ్ ఎ) విజయ పుష్ప, సి.ఒ (ఐటి) రాజశేఖర్, నల్సాఫ్ట్ ప్రతినిధులు అనిరుద్ధ్, అఖిల్, వికాస్, హరిప్రసన్న, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ అభివృద్ధి దేశానికే ఆదర్శం

### నేషనల్ డిఫెన్స్ అకాడమీ అధికారుల బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేషనల్ సెక్యూరిటీ అండ్ స్టేటస్టిక్ స్టడీస్ అంశంపై న్యూఢిల్లీకి చెందిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ అధికారులు సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ అభివృద్ధిని పరిశీలించారు. అంతకుముందు ఆ బృందం సభ్యులకు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నేషనల్ డిఫెన్స్ అకాడమీ అధికారుల బృందం సభ్యులు మాట్లాడుతూ.. గజ్వేల్ అభివృద్ధి అబ్బురపరిచిందన్నారు. మహతి ఆడిటోరియం, సమీకృత మార్కెట్, ప్రభుత్వ ఆస్పత్రి, హెర్బల్ పార్క్, అర్బన్ పార్క్, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందించడం, విద్యార్థుల కోసం అతిపెద్ద ఎడ్యుకేషన్ హబ్ నిర్మించడం గొప్ప విషయమని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలను విద్యార్థినీ, విద్యార్థులకు వేరువేరుగా నిర్మించారని చెప్పారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గమైన గజ్వేల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశానికి దిక్సూచిగా నిలబడిందన్నారు. ముందస్తు ప్రణాళికతో వెళ్లడంతో ఇలాంటి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం గజ్వేల్ సమీకృత భవనంలో సమీక్షించారు. వారి వెంట గజ్వేల్ స్పెషల్ అధికారి ముత్యం రెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్ ఉన్నారు.

## గాంధీజీ హత్య నేటి తరానికి తెలియాలి

- ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతిపిత మహాత్మా గాంధీ హత్య ఉదంతంపై వాస్తవాలు నేటి తరానికి తెలియాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా మంత్రుల నివాస ప్రాంగణంలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన గాంధీజీకి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీజీ హంతకుడు నాథూరాం గాడ్సేను పొగుడుతూ బిజెపి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ, వాస్తవ చరిత్రను వక్రీకరిస్తోందని అన్నారు. ఇలాంటి శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వాస్తవాలు వెల్లడి కాకుండే చెప్పుకున్నోడిదే చరిత్ర అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ హత్యతో మతోన్మాద ఉగ్రవాదానికి బీజం పడిందని అన్నారు. ఈ ఉన్మాదాన్ని యువత తుదముట్టించాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొని తొమ్మిదేళ్ల జైలు జీవితాన్ని అనుభవించిన జవహర్‌లాల్ నెహ్రూను కించపరుస్తూ బిజెపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. స్వాతంత్ర్యోద్యమంతోనే సంబంధం లేని బిజెపి తామే గొప్ప దేశభక్తులమని చెప్పుకోవడం విచారకరమని చెప్పారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి, భూదాన్ యజ్ఞ సంస్థ రాష్ట్ర నాయకులు యానాల ప్రభాకర్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అక్బర్ పాల్గొన్నారు.

# డబుల్ రోడ్డు వేసే వరకు పోరాడుతాం

- చివరి బడ్జెట్లోనైనా నిధులు కేటాయించాలి
- సిపిఎం నేతలు జూలకంటి, ముదిరెడ్డి డిమాండ్
- పాములపాడు నుంచి మాడుగులపల్లి వరకు పాదయాత్ర


పాదయాత్రలో మాట్లాడుతున్న జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాములపాడు నుంచి మాడుగులపల్లి వరకు డబుల్ బిటి రోడ్డు వేసే వరకు పోరాడుతామని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సిపిఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. బిటి రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం పాములపాడు గ్రామం నుంచి పాదయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి పాదయాత్ర పోరెడ్డిగూడెం, చిరుమర్తి, అగామోత్కూర్, గుర్రపుగూడెం శివారు, ఇందుగుల, మడుగులపల్లి వరకు 18 కిలోమీటర్ల వరకు సాగింది. ఆయా గ్రామాల్లో గ్రామస్తులు ఎదురెళ్లి పాదయాత్ర నాయకులకు తిలకం దిద్ది స్వాగతం పలికారు. 'ఇన్నాళ్లు మా సమస్యలు ఎవరూ పట్టించుకోలేదు.. మీరు మా సమస్యపై పాదయాత్ర చేయడం సంతోషకరం' అని ఆయా గ్రామాల ప్రజలు పాదయాత్ర బృందానికి కృతజ్ఞతలు తెలిపి పాదయాత్రలో వారూ నడిచారు. సాయంత్రానికి పాదయాత్ర మాడుగులపల్లికి చేరుకుంది. డప్పు వాయిద్యాల నడుమ ప్రజల మద్దతుతో పాదయాత్ర ఉత్సాహభరితంగా సాగింది. చిరుమర్తి గ్రామంలో సర్పంచ్ నాంపల్లి శ్రీశైలం పాదయాత్ర బృందానికి పూలమాలలు వేసి స్వాగతం పలికారు. గ్రామ శివారు వరకు ఆయన పాదయాత్రతో నడిచి మద్దతు తెలిపారు. ఇందుగుల గ్రామస్తులు పెద్దఎత్తున పాదయాత్రలో కలిసి నడిచారు.

ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మాడుగులపల్లి నుంచి పాములపాడు వరకు 18 కిలోమీటర్లు, అదనంగా మరో నాలుగు కిలోమీటర్లు భీమారం వరకు డబుల్ బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. వామపక్ష నాయకులు ప్రాతినిధ్యమున్న సమయంలో సింగిల్ రోడ్డు వేశారని, ఇప్పటివరకు డబుల్ రోడ్డుకు నోచుకోలేదన్నారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, నకిరేకల్ నియోజకవర్గాలకు ఈ రోడ్డు ప్రధానమైందని చెప్పారు. డబుల్ రోడ్డు వేయడం వల్ల పది నుంచి 12 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. ప్రస్తుతం బస్సులు, లారీలు, ఆటోలు ఇతర వాహనాలు పెద్దఎత్తున రాకపోకలు సాగిస్తున్నాయని, దీనివల్ల రద్దీ పెరిగి రోడ్డు సరిపోవడం లేదన్నారు. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే ఆగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. రోడ్డు చిన్నగా ఉండటం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. దానికితోడు రోడ్డు అంతా గుంతలమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ రోడ్డు కోసం అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వివరించామని, అయినా స్పందించకపోవడంతోనే పాదయాత్ర చేపట్టినట్టు తెలిపారు. తమది ఉద్యమాల పార్టీ అని, ప్రజాసమస్యల ఎజెండాగా ఉద్యమాలు చేస్తామని, ఓట్లు సీట్లు లెక్క కావని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన పోరాడేందుకు తమ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. ఇది ఎన్నికల సంవత్సరమని, రాష్ట్ర ప్రభుత్వం చివరిగా ప్రవేశపెట్టే బడ్జెట్లో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనికోసం మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. డబుల్ రోడ్డు వేసే వరకు ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాదూరి శశిధర్ రెడ్డి, చౌగాని సీతారాములు, వేములపల్లి వైస్ ఎంపిపి పాదూరి గోవర్ధన, సిపిఎం మండల కార్యదర్శి రొంది శ్రీనివాస్, సహాయ కార్యదర్శి శ్రీకర్, నాయకులు అశోక్‌రెడ్డి, పాల్వాయి రామిరెడ్డి, తంగేళ్ల నాగమణి, రేమిడల బిక్షం, బొంగర్ల వెంకటయ్య, ఇందిరా, మంగమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్‌భవన్‌లో రాజకీయాలు మానుకోవాలి

- గవర్నర్ తీరును తప్పుబట్టిన మంత్రి కెటిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగబద్ధ పదవిలో ఉంటూ ఓ పార్టీకి వంతపాడుతూ రాజ్‌భవన్‌లో రాజకీయం చేస్తున్నారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ గవర్నర్‌నుద్దేశించి వాఖ్యనించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో సోమవారం పర్యటించిన ఆయన జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చిందని, పార్లమెంట్ సాక్షిగా ఎన్నో వాగ్దానాలు చేసిందని తెలిపారు. ఫిబ్రవరి 1న కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్ చివరిదని, తెలంగాణకి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్‌లోనైనా తెలంగాణకు న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేశారు. దేశంలో రైల్వే నెట్‌వర్క్‌లో తెలంగాణ 3 శాతం మాత్రమే ఉందని, ఇక్కడ పంటలు, ఇతర ఉత్పత్తులు ఎగుమతులు కావాలంటే రైల్వే లైన్ కావాలని అన్నారు. 50 శాతం కేంద్రం ఇస్తే మరో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ కొత్త స్కీమ్ తెచ్చారని చెప్పారు. అయినప్పటికీ తాము రైల్వే లైన్ల కోసం రూ.1904 కోట్లు ఖర్చు చేస్తే.. కేంద్రం నుంచి రూ.1104 కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. తెలంగాణకు మెడికల్ కాలేజీ సహా నవోదయలాంటి ఏ ఒక్క కేంద్ర విద్యాలయాలు ఇవ్వలేదని చెప్పారు. పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇవ్వలేదని, మెగా పవర్‌లూమ్ క్లస్టర్ కోసం అడుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## కొత్తగూడెంలో వ్యబిచార గృహాలపై పోలీసుల దాడి

- ఇద్దరు మైనర్లకు రక్షణ..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో కొనసాగుతున్న వ్యభిచార గృహాలపై సోమవారం పోలీసులు మూకుమ్మడి దాడులు నిర్వహించారు. మైనర్ బాలికలే లక్ష్యంగా వ్యభిచార కూపంలోకి లాగుతున్న నిర్వాహకులతో పాటు విటులను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు మైనర్ బాలికలు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు వారిని రక్షించారు. వారిపై తమ్మిదిమంది లైంగికదాడికి పాల్పడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. త్రీటౌన్ సిఐ అబ్బయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని గణేష్ బస్తీలోగల ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతుందన్న విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం త్రీ టౌన్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో ఇద్దరు మైనర్ బాలికలను రక్షించారు. వారిపై తొమ్మిదిమంది లైంగికదాడికి పాల్పడినట్టు గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి పోక్సో యాక్ట్ కింద రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. గతేడాది జూలైలోనూ ఈ ఏరియాలో దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు.

## వేధింపులకు గురిచేస్తున్న ఉపాధ్యాయురాలు మాకొద్దు

- ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల రాస్తారోకో
- ఉపాధ్యాయురాలు ఐటిడిఎకు సరెండర్


రోడ్డుపై బైఠాయించిన ఆశ్రమ విద్యార్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమను మానసికంగా వేధింపులకు గురిచేస్తూ తమ తల్లిదండ్రులకు తప్పుడు సందేశాలు పంపిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న ఉపాధ్యాయురాలు తమకు వద్దని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లా వెంకటాపురం మండలం చిరుతపల్లి-2 బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సోమవారం పేరూరు - వెంకటాపురం ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినీలను సెల్‌ఫోన్‌లో అసభ్యకరంగా చిత్రీకరిస్తూ.. తమ తల్లిదండ్రులకు తప్పుడు సమాచారం అందిస్తూ మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ఉపాధ్యాయురాలు రాజేశ్వరి మాకు వద్దని, డిప్యూటేసన్‌పై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు నాగరాజును తిరిగి నియమించాలని డిమాండ్ చేశారు. రెండు గంటలకు పైగా విద్యార్థులు ఆందోళన చేపట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న బర్లగూడెం సర్పంచ్ కొర్సా నర్సింహమూర్తి, పోలీసులు విద్యార్థులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీనివ్వడంతో ఆందోళన విరమించారు. కాగా ఘటనపై ములుగు జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయురాలిపై వెంటనే విచారణ చేపట్టాలని డిప్యూటీ డిఇఒ సారయ్య, ఎటిడిఒ దేశీరాం, ఎసిఎంఒ రవిందర్‌ను ఆదేశించారు. ఈ మేరకు చిరుతపల్లి-2 ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సమక్షంలో సంఘటనపై విచారణ జరిపారు. ఉపాధ్యాయురాలు రాజేశ్వరిని ఐటిడిఎకు సరెండర్ చేస్తున్నట్టు తెలిపారు. డిప్యూటేషన్‌పై వెళ్లిన నాగరాజును నియమించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడుతామని అధికారులు హామీ ఇచ్చారు.



## గుడిసెవాసుల పోరాటానికి అండగా ఉంటాం

- ప్రజాసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్. వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసిన నిరుపేదల పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్. వీరయ్య తెలిపారు. గుడిసె వాసుల పోరాటానికి మద్దతు తెలుపుతూ సోమవారం ఆ ప్రాంతాన్ని సందర్శించిన వీరయ్య వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఇక్కడి భూమి ఏ భూస్వామికి చెందినది కాదని, 40 ఏండ్లుగా కాస్తు కబ్జాలో లేరని 2022 జూన్‌లో ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ తీర్పు ఇచ్చినా భూస్వాముల ఆగడాలు ఎక్కువయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే గుడిసె వాసుల కమిటీలపై, తమ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించి బెదిరిస్తున్నారని అన్నారు. సర్వే నెంబర్-109లో 20 ఏండ్లుగా పార్టీ అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించిందని, భూస్వాములను తరిమికొట్టైనా ఈ భూమి మీదకు రాకుండా ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా జక్కులుద్దిలో గుడిసెలేసుకున్న వారిపై తెల్లవారుజామున 3 గంటలకు దాడి చేశారని, గర్భిణులను సైతం కొట్టారని, అయినా అన్ని దాడులను ఎదుర్కొంటూ గుడిసె వాసులు పోరాడుతున్నారని, వారి పోరాటానికి సిపిఎం అండగా ఉందని గుర్తుచేశారు. పస్రాలో పోరాటానికి రాష్ట్ర ప్రజా సంఘాల ఐక్యవేదిక అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో 60 కేంద్రాల్లో పేదలు ఇండస్థలాల కోసం పోరాటం నిర్వహిస్తున్నారని, వారందరికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హామీ మేరకు అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గానీ, ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు గానీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుడిసె వాసులకు పట్టాలు వచ్చేవరకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, సిఐటియు రాష్ట్ర నాయకులు కాసు మాధవి, వ్యకాస రాష్ట్ర నాయకులు బి రెడ్డి సాంబశివ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొదిళ్ల చిట్టిబాబు, తీగల ఆదిరెడ్డి, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 25వ జాతీయ హెచ్‌ఆర్‌డి సదస్సు

- హాజరు కానున్న మంత్రి కెటిఆర్

**హైదరాబాద్ :** జాతీయ మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఆర్‌డి) హైదరాబాద్‌లో ఫిబ్రవరి 2-4 తేదిల్లో 25వ వార్షిక సదస్సును నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దీనికి 1200 మంది అతిథులు రావొచ్చని ఎన్‌హెచ్‌ఆర్‌డి హైదరాబాద్ చాప్టర్ ప్రెసిడెంట్, ఆ రంగం పరిశ్రమ నిపుణులు డాక్టర్ విపుల్ సింగ్ తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సోమవారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ 110 మందికి పైగా వక్తలు ఇందులో పాల్గొంటారన్నారు. "డీకోడ్ ద ఫ్యూచర్" అనే అంశంపై చర్చిస్తారన్నారు. ఈ సంవత్సరం జరిగే సదస్సు దేశంలోని హెచ్‌ఆర్ కార్యక్రమాలన్నింటిలోకి అతి పెద్దదని పేర్కొన్నారు. ఈ సదస్సులో హెచ్‌ఆర్ ప్రముఖులు, నిపుణులు, దేశవ్యాప్తంగా ఉన్న వృత్తి నిపుణులు పాల్గొననున్నారన్నారు. ఈ సదస్సును మంత్రి కెటిఆర్ లాంఛనంగా ప్రారంభించనున్నారని తెలిపారు.

ఈ సదస్సును తెలంగాణ పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి కె.తారకరామారావు ప్రారంభించి 'ఆర్థిక భవిష్యత్తును డీకోడింగ్ చేయడం: 5టీ ఎకానమీకి ఉత్ప్రేరకంగా హైదరాబాద్' అనే అంశంపై కీలకోపన్యాసం చేయనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సాహభరితమైన కార్యక్రమానికి పరిశ్రమ నిపుణులు డాక్టర్ విపుల్ సింగ్ (ఎన్‌హెచ్‌ఆర్‌డి హైదరాబాద్ చాప్టర్ ప్రెసిడెంట్) నాయకత్వం వహించడం, జాతీయ చాప్టర్ అధ్యక్షుడు ఎస్.వి.నాథన్, కాన్ఫరెన్స్ కన్వీనర్ శ్రీని వుడుముల ఈ బహత్తర కార్యక్రమాన్ని నడిపిస్తారు. హాజరైనవారికి తాజా హెచ్‌ఆర్ ధోరణులు, వ్యూహాలు, సాంకేతికతల గురించి తెలుసుకోవడానికి, తోటివారితో అర్థవంతమైన చర్చల్లో నిమగ్నం కావడానికి అవకాశం ఉంటుంది. ఈ సదస్సులో పాల్గొనేవారికి సంబంధాలను పెంపొందించుకోవడానికి, వారి వత్తిపరమైన నెట్ వర్క్‌లను విస్తరించడానికి బోలెడన్ని అవకాశాలను అందిస్తుంది.


మురళీమోహన్‌ను సత్కరిస్తున్న వక్తలు

## నటనలో మాటలో స్వచ్ఛత మురళీమోహన్ వ్యక్తిత్వం

ప్రజాశక్తి-కల్చరల్

నటన లోనూ మాటల లోనూ స్వచ్ఛత మురళిమోహన్ వ్యక్తిత్వం అని అందుకే ఆయన అజాత శత్రువు అయ్యారని ఐక్య ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై నటుడు మురళిమోహన్ సినీ జీవిత స్వర్ణోత్సవ వేడుక జరిగింది. ముఖ్యఅతిథిగా జస్టిస్ భవానీ ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ తీర్పు వారికి వ్యతిరేకంగా ఉంటే ఇప్పుడు రాజకీయ నాయకులు మాట్లాడే భాషలో తిట్లు న్యాయమూర్తులు పడవలసి ఉంటుందని, కానీ సినిమా పరిశ్రమలో వుంటూ తిట్లు తినని నటుడు మురళిమోహన్ అని ప్రశంసించారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం సినీ కార్మికులకు సంక్షేమం కోసం కృషి వారిని ఉన్నత స్థానంలో నిలిపాయని అన్నారు. అధ్యక్షత వహించిన పారిశ్రామిక వేత్త సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ మురళిమోహన్ వంటి కల్మషం లేని నటులు అరుదని అన్నారు. ఆయన జీవనవిధానం ఆదర్శనీయమన్నారు. వేదిక పై దర్శక నిర్మాత వైవిఎస్ చౌదరి, దర్శకుడు రేలంగి నరసింహ రావు, లక్ష్మి తుమ్మల, నాట్య గురువు డాక్టర్ భారతి తదితరులు పాల్గొనగా లంకా లక్ష్మీ నారాయణ స్వాగతం పలికారు. భాగి శాస్త్రి, త్యాగరాజు, సంజయ్ భరద్వాజ్ తదితర సభ్యులు సహకరించారు. తొలుత అమెరికా గాయని శారద నిర్వహణలో సినీ విశ్లేషకులు ఎస్‌వి రామారావు వ్యాఖ్యానంలో సినీ గాన విభావరి నిర్వహించారు.




## యశోద హాస్పిటల్స్ ఇంటర్నేషనల్ పల్మనాలజీ సదస్సు సక్సెస్

- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి హరీష్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యశోద హాస్పిటల్స్ నిర్వహించిన ఇంటర్నేషనల్ పల్మనాలజీ లైవ్ వర్క్ షాప్ విజయవంతంగా ముగిసింది. 40మంది అంతర్జాతీయ అధ్యాపకులు, 120మంది జాతీయ అధ్యాపకులు. సుమారు 2వేల మంది పల్మోనాలజీ వైద్యులు పాల్గొన్నారు. ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీపై వరల్డ్ అసోసియేషన్, యూరోపియన్ అసోసియేషన్, మలేషియన్ అసోసియేషన్ ఆమోదించిన ఆసియాలోనే అతిపెద్ద లైవ్ వర్క్ షాప్ రెండోరోజు సదస్సును తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. ఆధునికతను సంతరించుకుంటూ, తన పరిధిని విస్తరించుకుంటున్న ఊపిరితిత్తుల వైద్య విభాగం, వైద్య విజ్ఞాన శాస్త్రంలో చోటుచేసుకుంటున్న సరికొత్త ఆవిష్కరణలపై దృష్టిసారించేందుకు వివిధ దేశాల వైద్య నిపుణుల మధ్య వైద్య విజ్ఞానాన్ని పంచుకోవడానికి వేదికగా నిలిచిందని అన్నారు. సదస్సును నిర్వహించిన యశోద యాజమాన్యాన్ని అభినందించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ వైద్యులు ప్రొఫెసర్ ఫెలిక్స్ హెర్త్ - థొరాక్స్ క్లినిక్ (జర్మనీ), ప్రొఫెసర్ కైల్ హెూగార్త్ - యూనివర్శిటీ ఆఫ్ చికాగో (యుఎస్ఎ), డాక్టర్. మైఖేల్ ప్రిట్చెట్ (యుఎస్ఎ), డాక్టర్. పల్లవ్ షా (లండన్), డాక్టర్. మునవ్వర్ (లండన్), డాక్టర్. లోరెంజో (ఇటలీ), డాక్టర్. జమాలుల్ (మలేషియా)తో పాటు పలువురు ప్రముఖ వైద్యులు సదస్సులో పాల్గొన్నారు.

## సిసిటివి ట్యాంపరింగ్‌పై కేసు నమోదు

- స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- ఆన్‌లైన్ మూల్యాంకనంతో ఎన్నో ప్రయోజనాలు
- ఇంటర్ విద్య కమిషనర్ నవీన్ మిట్టల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ విద్యా కమిషనర్ కార్యాలయం నుంచి డేటా చోరీకి పాల్పడేందుకు సిసిటివి ట్యాంపరింగ్ జరిగినట్టు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఇంటర్ విద్య కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని ఇంటర్ విద్య కమిషనర్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంటర్ పరీక్షల మూల్యాంకనాన్ని కంప్యూటరైజ్డ్ చేయడం ద్వారా ఎన్నో ప్రయోజనాలుంటాయని తెలిపారు. తొందరగా ఫలితాలు రావడంతో పాటు రీకౌంటింగ్, రీవాల్యుయేషన్ కూడా వేగంగా చేయవచ్చని తెలిపారు. తొలి దశలో ఆర్ట్స్, కామర్స్, లాంగ్వేజెస్‌ను ఆన్‌లైన్ మూల్యాంకనం చేపడుతామనీ, రెండేండ్లలో సైన్స్ సబ్జెక్టులను సైతం అందులోకి చేర్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. కొంత మంది అవగాహన లేని, అర్హత లేని వ్యక్తులు చేసే తప్పుడు ప్రచారంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. ఎసిబి కేసుతో పాటు అట్రాసిటీ, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఇంటర్ విద్య ప్రక్షాళన కోసం చేపడుతున్న సంస్కరణలపై మాట్లాడే అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. ఒకసారి స్క్రిప్ట్ సిస్టమ్‌లోకి వెళితే లెక్చరర్లకు తర్వాత పేపర్లు ర్యాండమ్ గా వస్తాయని వివరించారు. ఆఫ్‌లైన్‌లో పేపర్లు దిద్దేందుకు లెక్చరర్లు క్యాంపుల వద్దకు రావడం ఖర్చుతో కూడుకున్నదనీ, ఈ విధానంలో ఎక్కడి నుంచైనా దిద్దేందుకు వెసులుబాటు కలుగుతుందన్నారు. మానవ తప్పిదాలకు అవకాశముండదనీ, మార్కుల మొత్తం కంప్యూటర్ గణిస్తుందన్నారు. ఇందు కోసం లెక్చరర్లకు రెండు ఆప్షన్లు ఇస్తున్నామనీ, తొలి ఆప్షన్ మూల్యాంకనం చేసే వారు తమ సొంత కంప్యూటర్, సొంత స్థలంలో చేసేందుకు ఎంచుకోవచ్చన్నారు. ఆ సౌకర్యం లేని వారు తాము ఏర్పాటు చేసే ప్రాంతాల్లో దిద్దేందుకు ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ తదితర యూనివర్సిటీల పరీక్షల నిర్వాహకులు ఆన్‌లైన్ మూల్యాంకనంలో తమ అనుభవాలను, వచ్చిన ఫలితాలను వివరించారు. ఈ సమావేశంలో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి శ్రీనాథ్, పీఏఎల్‌పీ అధ్యక్షులు నాగరాజు, డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ.వీ.ఆర్.నర్సింహారెడ్డి, ఇంటర్ బోర్డు సీఇవో జయప్రదబాయి, జాయింట్ సెక్రెటరీ వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో పోడు భూములకు పట్టాలు

- మంత్రి సత్యవతి రాథోడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోడు భూములకు ఫిబ్రవరి మొదటి వారంలో పట్టాలివ్వాలనీ, అందుకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసి సిద్ధంగా ఉంచుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సోమవారం తెలిపారు. ఇప్పటికే వందశాతం సర్వేను గ్రామ సభల ద్వారా పూర్తి చేశామన్నారు. పోడు భూములకు సంబంధించి ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను ఫారెస్ట్ రైట్స్ కమిటీలు, జిల్లా స్థాయి కమిటీల ద్వారా పరిశీలించి లబ్దిదారులను గుర్తించే ప్రక్రియ గతేడాది నుంచి కొనసాగుతుందని తెలిపారు. పోడు భూములకు సంబంధించిన పత్రాలు జారీ చేసే అంశంపై జిల్లా కలెక్టర్లతో సోమవారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌నుంచి రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిలతో కలసి మంత్రి సత్యవతి రాథోడ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికీ పోడు భూములకు పట్టాలివ్వడంతోపాటుగా అడవుల సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. ఏ జిల్లాల్లోనైతే పోడు భూములకు అధికంగా దరఖాస్తులు అందాయో వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంలో స్థానిక ప్రజా ప్రతినిధులందరినీ భాగస్వామ్యులను చేయాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో అటవీ శాఖ, రెవెన్యూ సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. శాంతి కుమారి మాట్లాడుతూ.. అన్ని స్థాయిల్లో ఈ ప్రక్రియను పూర్తిచేసుకొని పట్టా పాస్ పుస్తకాన్ని ప్రింట్ చేసి, ఫిబ్రవరి మొదటి వారానికల్లా సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పీసీసీఎఫ్ డోబ్రియాల్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు తదితర అధికారులు పాల్గొన్నారు.